ప్రజాశక్తి

సోమవారం 17 మార్చి 2025   8 పేజీలు





గుంటూరు   పల్నాడు

20న అత్యవసర భేటీ!



- ఇన్‌ఛార్జి మేయర్‌ఎంపికపై ప్రభుత్వానికి నివేదిక
- మేయర్ మనోహర్ నాయుడు రాజీనామా ఆమోదానికి కౌన్సిల్ సమావేశంలో చర్చ
- నేడు యథాతథంగా స్టాండింగ్ కమిటి సమావేశం
- ఆరుగురు సభ్యుల్లోనే ఒకరికి అధ్యక్ష స్థానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర పాలక సంస్థ అత్యవసర సమావేశం ఈనెల 20న నిర్వహించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు నిర్ణయించారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు రాజీనామా నేపథ్యంలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మేయర్ రాజీనామాను కౌన్సిల్‌లో చర్చించి ఆమోదిస్తారు. తరువాత నూతన మేయర్ ఎన్నిక కోసం ఎన్నికల కమిషన్‌కు జిల్లా కలెక్టర్ నివేదిస్తారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతన మేయర్ ఎన్నికకు షెడ్యూలు ప్రకటిస్తుంది. ఈ ప్రక్రియ ముగిసే లోగా కార్పొరేషన్ వ్యవహారాలను నిర్వహించేందుకు మేయర్ స్థానంలో ఇన్‌ఛార్జి మేయర్‌గా డిప్యూటీ మేయర్‌ను నియమిస్తారు.

ఒక్క డిప్యూటీ మేయర్ ఉంటే ఇన్‌ఛార్జి మేయర్‌గా ప్రకటించే అవకాశం ఉంటుంది. కానీ ఇద్దరు డిప్యూటీ మేయర్లు ఉండటం, ఒకరు వైసిపి, మరొకరు టిడిపి తరుపున ఉండటంతో ఈ పదవి ఎవరికి ఇస్తారన్నదీ చర్చనీయాంశంగా మారింది. డిప్యూటీ మేయర్‌గా తొలుత డైమండ్‌బాబు నియమితులయ్యారు. మేయర్ మనోహర్ నాయుడుతోపాటు డైమండ్ బాబు కూడా 2021 మార్చి 18న ప్రమాణస్వీకారం చేశారు. తరువాత రాజకీయ ఉపాధి, సమీకరణల పేరుతో అప్పటి ▶ 2లో

దిగ్విజయీభవ



- నేటి నుండి పదో తరగతి పరీక్షలు
- గుంటూరు జిల్లాలో 31,543, పల్నాడులో 26,497 మంది చొప్పున విద్యార్థులు
- గుంటూరులో ఉపాధ్యాయులకు షోకాజులు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. సోమవారం నుంచి మార్చి 31వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయి. ఇందుకోసం జిల్లాలో మొత్తం 150 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెగ్యులర్ విద్యార్థులు 29,449 మంది, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు 961 మంది, ఓపెన్ స్కూల్ విద్యార్థులు 1133 మంది మొత్తం 31,543 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష ఉంటుంది. కాగా మొదటి రోజు గంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. పరీక్షా కేంద్రంలోకి పెన్ను, హాల్‌టిక్కెట్ తప్ప ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు ఏవీ అనుమతించరు. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. హాల్ టిక్కెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా



గుంటూరులోని యాదవ హైస్కూల్లో నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

9951397109, 9052343447 నంబర్లలో సంప్రదించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక సూచించారు. కాగా గుంటూరులో పరీక్ష విధులు కేటాయించబడిన ఉపాధ్యాయులు ఆయా పరీక్షా ▶ 2లో



సీనియర్ నాయకులను పరామర్శిస్తున్న బి.వెంకట్ తదితరులు

రెండు కోట్ల రేషన్ కార్డులను రద్దు చేసిన కేంద్రం

- ఆహార సబ్సిడీకి రూ.70 వేల కోట్లు కోత
- పథకాలకు ఎగనామం పెట్టేందుకే ఫుడ్ కూపన్ల యోచన : వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

దేశవ్యాప్తంగా రెండు కోట్ల రేషన్ కార్డులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, పేదలను కొట్టి పెద్దలకు పెట్టే విధానాలను మరింత పెంచిన కేంద్రంలోని బిజెపిపై పోరాటానికి ప్రజలు సన్నద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. సత్తెనపల్లికి శనివారం వచ్చిన ఆయన వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ▶ 2లో



రంజాన్ సమయాలు

ఇఫ్తార్ : 6.24 (సోమవారం - సాయంత్రం)

సహర్ : 4.58 (మంగళవారం - ఉదయం)



చిలకలూరిపేట 12వ వార్డులో శ్మశానాన్ని పరిశీలిస్తున్న సిపిఎం బృందం



గుంటూరు కళ్యాణి నగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

స్నానం చేయాలన్నా నీరు కరువే!

- సిపిఎం ప్రజాచైతన్య యాత్ర బృందాల ఎదుట సమస్యల ఏకరువు
- విద్యుల్ బిల్లులపై ఆవేదన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అడవిని తలపిస్తున్న శ్మశానం, స్నానం చేయడానికీ అందుబాటులో లేని నీరు, అస్తవ్యస్త రహదార్లపై పట్టణంలోని 12వ వార్డు ప్రజలు తమ ఆవేదనను సిపిఎం నాయకులు ఎదుట వ్యక్తం చేశారు. ఆ పార్టీ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం బృందం 12వ వార్డులో ఆదివారం పర్యటించింది. పలు ఇళ్లను సందర్శించి విద్యుత్ బిల్లులపై వివరాలను, ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మీటర్ రీడింగ్‌లో అవకతవకలున్నట్లు పలువరు చెప్పారు. గత నెల వాడిన 119 యూనిట్ల కరెండు వాడగా రూ.1034 బిల్లు వచ్చిందని చిరు దుకాణం నిర్వాహకుడు షేక్ గఫూర్ వాపోయారు. చిన్న దుకాణమే అయినా వ్యాపారం చేస్తున్నారంటూ స్మార్ట్ మీటర్ బిగించారని వాపోయారు. ఎవరూ నివాసం ఉండని ఇళ్లకు సైతం వివిధ రకాల ఛార్జీలు కలిపి అధికంగా బిల్లు వస్తోందని నాయకులు దృష్టికి వచ్చింది. పట్టణంలోని హిందూ, క్రిస్టియన్ ఏకైక శ్మశాన వాటికను 2016లో అభివృద్ధి చేశారని, తర్వాత పట్టించుకోక అడవిని తలపిస్తోందని చెప్పారు. వెళ్లడానికి సరైన మార్గం, విద్యుత్ దీపాలు లేవని, స్థలమూ ఆక్రమణకు గురవుతోందని, విష సర్పాలు సంచరిస్తున్నాయని 12వ వార్డు ప్రజలు చెప్పారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ ఏప్రిల్‌లో ఈస్టర్ పండుగ దృష్ట్యా మున్సిపల్ అధికారులు స్పందించాలని, శ్మశానాన్ని బాగు చేయించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు తీవ్ర భారంగా మారిన విద్యుత్ ఛార్జీల సమస్యపై 28న స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఎం చేపట్టే ధర్నాకు తరలిరావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, నాయకులు టి.ప్రతాప్‌రెడ్డి, ఎస్.బాబు, ఎస్.కృపారావు, పి.గణేష్ పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై ఇళ్లకు పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఎం చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలలో భాగంగా ఆ పార్టీ గుజ్జనగుండ్ల శాఖ ఆధ్వర్యంలో కళ్యాణి నగర్, రైల్వేట్రాక్, ఇతర ప్రాంతాలలో నాయకులు ఆదివారం నిర్వహించారు. స్థానికంగా రైల్వే ట్రాక్‌పై ఇళ్లేసుకుని 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న ప్రజలు వారి సమస్యలను నాయకుల ▶ 2లో

20న అత్యవసర భేటి!

(మొదటి పేజీ తరువాయి)

వైసిపి ప్రభుత్వం కార్పొరేషన్లలో రెండో డిప్యూటీ మేయర్, మున్సిపాల్టీల్లో రెండో వైస్ చైర్మన్ పదవులను ప్రకటించింది. గుంటూరు రెండో డిప్యూటీ మేయర్గా వైసిపి నుంచి ఎంపికైన షేక్ సజీల 2021 మేలో ప్రమాణస్వీకారం చేశారు. దీంతో సీనియారిటీ ప్రాతిపదికన తమకే అవకాశం ఇవ్వాలని డైమండ్ బాబు గ్రూపు వాదిస్తోంది. అయితే ఎన్నికల ముందే టిడిపిలో చేరిన రెండో డిప్యూటీ మేయర్ సజీలను ఇన్‌ఛార్జి మేయర్గా ప్రకటించాలని టిడిపి నాయకలు పట్టుబడుతున్నారు. అయితే ఇన్‌ఛార్జి మేయర్గా ఎవరిని ఎంపిక చేయాలన్న అంశంపై ప్రభుత్వానికి నివేదిక పంపామని అధికార వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం ఎవరికి ఎంపిక చేస్తే వారే ఇన్‌ఛార్జి మేయర్ హోదాలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించడంతో పాటు తదుపరి మేయర్‌ను ఎన్నుకునే వరకు వారే కొనసాగుతారని అధికారులు చెబుతున్నారు.

మరోవైపు మేయర్ కావటి మనోహర్ నాయుడు వైసిపి నాయకులకు సమాచారం ఇవ్వకుండా రాజీనామా చేయడంతో ఆ పార్టీ నాయకులు తదుపరి కార్యచరణపై ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. మేయర్‌ను పలువురు వైసిపి నాయకులు, కార్పొరేటర్లు ఆదివారం సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదని చెబుతున్నారు. మరోవైపు సోమవారం జరగాల్సిన నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం యధాతథంగా జరుగుతుందని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మేయర్ రాజీనామా చేయడం వల్ల కమిటీలోని ఆరుగురు సభ్యుల్లో ఒకరిని అధ్యక్షులుగా ఎంపిక చేసి సమావేశం నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 20, జనవరి 4న రెండు విడతలుగా నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశం అసంపూర్తిగా ముగియగా ఈ సమావేశం తిరిగి ఎప్పుడు నిర్వహించాలనే అంశంపై ఇంకా అధికారులు నిర్ణయం తీసుకోలేదు. మేయర్ రాజీనామా వల్ల ఏర్పడిన ప్రతిష్ఠంభనతో ఇన్‌ఛార్జి మేయర్ ఎంపిక పూర్తయిన తరువాతనే సర్వసభ్య సమావేశంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

రెండు కోట్ల రేషన్ కార్డులను రద్దు చేసిన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధి కరువై కోట్లాది మంది వేల కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలకు వలసలు వెళ్తుంటే వారి బాధలను పట్టించుకోని కేంద్రం రేషన్ కార్డులను రద్దు చేయడం దారుణమన్నారు. లక్ష మంది కూలీలకు ఆధార్ కార్డులూ లేవని చెప్పారు. ఆధార్ ప్రామాణికంగా తీసుకోవద్దని స్వయాన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం బిజెపి పట్టించుకోకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతోందని విమర్శించారు. సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా ఉన్న రేషన్ కార్డును తీసివేయడం అంటే పేదలను ఆ పథకాలకు దూరం చేయడమేనని, ఇది ఆకలి బాధలు, ఆత్మహత్యల పెరుగుదలకు దారి తీస్తుందని చెప్పారు. పేదరిక నిర్మూలన కోసం పనిచేస్తామని చెప్పిన బిజెపి పేదలను నిర్మూలించే విధానాలను అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే జాతీయ గ్రామీణ ఉపాధిలో 6 కోట్ల మంది జాబ్ కార్డులను రద్దు చేశారని, చట్టం అమలుకు నిధులనూ తగ్గించారని విమర్శించారు. గత రెండేళ్లలో ఆహార భద్రతకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు భారీ మొత్తంలో తగ్గిస్తున్నారని, తాజాగా రూ.70 వేల కోట్లు కోత విధించారని తెలిపారు. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఫుడ్ కూపన్ల పేరుతో నగదు బదిలీ యోచన పథకాలకు కోత పెట్టడానికేనన్నారు. ఈ విధానాలను వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ఉద్యమాలకూ సిద్ధమవుతోందని చెప్పారు. ఆయా ఉద్యమాల్లో ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు రామలింగరాజును పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.రవిబాబు, కె.రోశయ్య, నాయకులు కె.నాగేశ్వరరావు, జె.భగత్, ఏపూరి వెంకటేశ్వర్లు, జె.రాజ్‌కుమార్ డి.సుజాత పాల్గొన్నారు.





స్నానం చేయాలన్నా నీరు కరువే!

దృష్టికి తీసుకొచ్చారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, కాల్వలు, రోడ్లు వేయాలని కోరారు. సీలింగ్ ల్యాండ్ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, కార్యదర్శివర్గ సభ్యులు బి.సత్యనారాయణ, కమిటీ సభ్యులు షేక్.ఖాజావలి, భాషా, నాయకులు బాబురావు, సుందరరావు, బాబు, భానుప్రసాద్ పాల్గొన్నారు. స్థానిక ప్రగతి నగర్‌లోని నిర్వహించిన ప్రజాచైతన్య యాత్రలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, సభ్యులు షేక్.ఫాతిమా, జి.బాబు పాల్గొన్నారు.

పాతగుంటూరులో ..

పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కాల్వలు తీసే కార్మికులు రావట్లేదని, దోమలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారని సిపిఎం నగర కార్యదర్శి నళినీకాంత్ అన్నారు. పాత గుంటూరులోని 8, 9, 11 డివిజన్‌లలో సిపిఎం బృందం పర్యటించగా అక్కడి పరిస్థితులపై నళినీకాంత్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి కార్మికుల సంఖ్యను పెంచి, అన్ని ప్రాంతాలకూ కేటాయించాలని డిమాండ్ చేశారు. సిపిఎం



నగర కమిటీ సభ్యులు తాడిబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ యానాది కాలనీ శివారు జానీ స్వరాజ్య నగర్‌లో రోడ్లు, మురుగు కాల్వలు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. చెన్నం వారి వీధిలో అడ్డ రోడ్లలో కాల్వల్లో మురుగు తొలగించక పోవడంతో రోడ్లపై మురుగు నిలుస్తోందని, దీంతో దోమలు ఎక్కువగా ఉన్నాయని మున్సిపల్ అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. శ్రామిక నగర్లో కాల్వల్లో రెండు నెలలుగా వ్యర్థాలు తొలగించట్లేదని స్థానిక ప్రజలు వాపోయారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్.అరుణ, పాతగుంటూరు శాఖ కార్యదర్శి ఎస్.కార్తీక్, నాయకులు కుమార్, టి.రాము పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక పిటీజీ బాలుర పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు లుక్ కల్చర్ మీడియా లిమిటెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో షేక్ సుభాని, షేక్ ఫిరోజ్ ద్వారా పరీక్ష సామగ్రిని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో హుస్సేన్, జానీ, ఖాసిం, విజయ్, జాకీర్ సూరి, శ్రీను, అబ్దుల్, ఫయాజ్ పాల్గొన్నారు

పట్టాభిపురం సిఐగా మధుసూదనరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు పట్టాభిపురం సిఐగా ఎం. మధుసూదనరావుగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు సిఐగా ఉన్న వీరేంద్రను సిసిఎస్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు రేంజి ఐజి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మధుసూధనరావు వెంటనే ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 2013లో సిఐగా పదోన్నతిపొందిన ఆయన కొత్తపేట, మంగళగిరి రూరల్, తాడేపల్లి, చేబ్రోలు, పిడుగురాళ్ల, నగరంపాలెం, గూడూరు రూరల్ సర్కిల్స్‌లో పనిచేశారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చెడు అలవాట్లకు బానిస అయిన యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయిన యువతిని పెళ్లి చేసుకుని హింసకు గురిచేసి మృతికి కారకుడైన యువకుడి ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వరంగల్‌కు చెందిన గీతిక (20) గుంటూరుకు చెందిన కొప్పుల సాయికుమార్ ఆరు నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం చేసుకున్నాడు. ఈ యువతి సెప్టెంబర్ 24న తల్లిదండ్రులతో హైదరాబాద్ బోయినపల్లిలో ఒక వివాహానికి వెళ్లగా అక్కడి నుంచి కనిపించకుండా పోయింది. యువతి కన్పించడంలేదని యువతి తండ్రి జగదీశ్వరచారి, తల్లి గాయత్రి బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెప్టెంబరు 25న ఆమె గుంటూరు వచ్చినట్టు సాయికుమార్ స్నేహితుడు ఉదయ్ అనే యువకుడు యువతి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కొద్ది రోజుల తరువాత తాను సాయికుమార్‌ను వివాహం చేసుకుని బాగానే ఉన్నానని గీతిక వరంగల్‌లోని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. నాలుగు నెలల గడిచాక సాయికుమార్ నిజస్వరూపం బయటపడింది. మత్తు పదార్థాలకు అలవాటు పడి ఆమెను వేధించడం ప్రారంభించారు. ఈనేపథ్యంలో ఈనెల 14న రాత్రి ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు గీతిక తల్లిదండ్రులకు సాయికుమార్ సమాచారం ఇచ్చాడు. శనివారం గుంటూరు వచ్చిన గీతిక తల్లిదండ్రులు గీతిక, సాయికుమార్ నివశించే ద్వారకా నగర్‌లోని ఇంటి ముందు బైఠాయించి ధర్నా చేశారు. సాయి కుమార్ తనను సరిగా చూడడం లేదని గంజాయికి బానిస కొడుతున్నాడని తమ కూతురు ఈనెల 14న ఫోన్ చేసిందని, తాము వచ్చేలోగానే ఆమె ఆత్మహత్య చేసుకుందని సమాచారం ఇచ్చారని తల్లిదండ్రులు జగదీశ్వరచారి, గాయత్రి అన్నారు. సాయి కుమారే అతని తల్లిదండ్రులు, స్నేహితులు కలిసి తన కుమార్తెను ఉరివేసి చంపారని ఆరోపించారు.



గతంలోను మరో ఇద్దరు అమ్మాయిలను ట్రాప్ చేశాడన్నారు. గీతిక ఉరి వేసుకోవడంపై వెనుక వైపు తలుపు తీసి ఉండడం శరీరంపై దెబ్బలు ఉండడంతో అనుమానంవచ్చి నల్లపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ కూతుర్ను ట్రాప్ చేసి అవసరం తీరిన తరువాత ఉరివేసాడని బోరున విలపించారు, ఉరి వేసుకునే అంత పిరికిది కాదని చెప్పారు. తమ కూతురు మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తమ కూతురుకి మూడు నెలల గర్భం ఉందని తెలిసినట్లు వెల్లడించారు. చేతికి అంది వచ్చును తమ కూతురిని ఇలా చనిపోవడం ఏమిటని కన్నీరు మున్నేరు అయ్యారు. సాయికుమార్ జులాయిగా తిరిగేవాడని, గ్రూపు మెయింటింగ్ చేస్తూ ఉండేవాడని, ఉదయ్ అనే వ్యక్తి అతనికి సపోర్టుగా ఉన్నాడని ఆరోపించారు. మతిపై పూర్తి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వేడుకొన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం ఆదివారం వారు స్వస్థలం వెళ్లారు కేసును అనుమానస్పద మృతిగా నమోదు చేసి నల్లపాడు సిఐ వంశీధర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

దిగ్విజయీభవ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాల్లో రిపోర్ట్ చేయకపోవటంతో 10 మంది ఉపాధ్యాయులకు గుంటూరు తూర్పు మండల విద్యాశాఖాధికారి ఖుద్దూస్ షోకాజు నోటీసులు జారీ చేశారు. పి.హరికృష్ణ, సత్యవతి దెబోరా, పి.చెంచులయ్య, జె.సామ్రాజ్యలక్ష్మి, సిహెచ్.శ్రీనివాసరావు, ఇ.నాగమల్లేశ్వరి, కె.బాలకృష్ణ, జె.జేమ్స్, ఎన్.సుజాత, ఎస్.శౌరిరెడ్డి వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్‌కు ముందుగా రిపోర్ట్ చేయకపోటంతో ఎంఇఒ షోకాజులిచ్చారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సోమవారం నుండి జరిగే పరీక్షలకు పల్నాడు జిల్లాలో ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. నరసరావుపేటలోని స్టోరేజ్ సెంటర్ నుండి ప్రశ్నపత్రాలను పోలీసుల పహారా మధ్య ఇప్పటికే భద్రపరిచారు. పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 26497 మంది విద్యార్థులు హాజరుకానుండగా 128 కేంద్రాలను ఏర్పాటు చేశ్శారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయానికి గంట ముందుగా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. సరైన కారణం చూపినట్లయితే 5 నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించనున్నారు. పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లను విద్యాశాఖ వెబ్సైట్లో అందుబాటులో ఉంచారు. విద్యార్థులు హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకుని నేరుగా పరీక్షకు హాజరయ్యే వీలు కల్పించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూం నంబర్8341135357కు సంప్రదించొచ్చు.

పరీక్షలను నిర్వహణ కోసం 128 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 128 మంది డిపార్టెమెంట్ అధికారులను, 4 అదనపు బృందాలతో పాటు 1680 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రాలున్న ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు, ఆన్లైన్ సెంటర్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద మెడికల్ కిట్, ఎఎన్ఎం అందుబాటులో ఉంటారు. నిరంతరం విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల శంకర భారతిపురం జిల్లా పరిషత్ హైస్కూల్, బొల్లాపల్లి మండలం బండ్లమోటు, రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం, కారంపూడి, క్రోసూరు, విజయపురిసౌత్ జిల్లా పరిషత్ హైస్కూళ్లను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా 6 ఫ్లయింగ్ స్కాడ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షలు జరిగే పాఠశాలల్లో మధ్యాహ్నం నుంచి తరగతులు నిర్వహించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం యధావిధిగా కొనసాగనుంది. రెగ్యులర్, ఓపెన్ పరీక్షలు జరిగే పాఠశాలలకు సెలవులు ఇవ్వనున్నారు. పరీక్షల అనంతరం సెలవురోజైన 2వ శనివారం తరగతులు నిర్వహించనున్నారు.

పిల్లల్ని ఒత్తిడికి గురిచేయొద్దు : డిఇఒ చంద్రకళ

విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. పిల్లలను తల్లిదండ్రులు ఒత్తిడికి గురిచేయొద్దు. విద్యార్థికి ఏ సమస్య ఉన్నా కంట్రోల్ రూంకు ఫోన్ చేస్తే వెంటనే పరిష్కరిస్తాం. విద్యార్థులు ఎటువంటి భయాందోళనకూ గురి కాకుండా పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలి.





ఆత్మకూరు గ్రామంలోని దళితవాడ, బిసి నివాస ప్రాంతంలో సిపిఎం నాయకులు ఈమని అప్పారావు, ఎం పకీరయ్య తదితరులు



గార్లపాడులో వాగు కట్టమీద ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

ఎంటిఎంసిలో విలీనమయ్యాక సమస్యలు పెరిగాయి

ఆత్మకూరులో సిపిఎం బృందానికి పలు సమస్యలు తెలిపిన గ్రామస్తులు

- సంక్షేమ బోర్డులేక సమస్యల్లో కార్మికులు
- కరెంటు బిల్లు ముట్టుకుంటే గుండె ఝల్లు
- రాజధానిలో స్థలం రద్దు చేశారు.. గ్రామాల్లోనూ ఇవ్వలేదు
- గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు స్థలమెక్కడో తెలీదు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న ఆత్మకూరును కార్పొరేషన్‌లో విలీనం చేసిన తరువాత పారిశుధ్య అధ్వాన్నంగా తయారయ్యిందని ఏ సమస్యను అయిన సచివాలయం దృష్టికి తీసుకు వెళితే ఎవరు పట్టించుకునే పరిస్థితి లేదని, ఏదైనా చెప్పాలంటే మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్దకు వెళ్లి చెప్పమంటున్నారని ఆత్మకూరు గ్రామస్తులు వాపోయారు. ఆదివారం సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, సీనియర్ నాయకులు ముసలి పకీరయ్య, మండల కమిటీ సభ్యులు గడ్డం అజయ్, పండల ప్రసాదు ఆత్మకూరు దళితవాడ, బిసి కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు బృందం దృష్టికి అనేక సమస్యలు తీసుకువచ్చారు. ముఖ్యంగా పారిశుధ్య సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ అద్వానంగా ఉండటంవల్ల ఎక్కడ మురుగు అక్కడ నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతూ రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు ముఖ్యంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని, విద్యార్థులకు విద్యా దీవెన ,అమ్మ ఒడి లాంటి పథకాలు ఈరోజు అమలు చేయలేక పోవడం వల్ల పేద మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని, ఇంటి అద్దెలు కట్టలేక ఇంటి స్థలాల కొరకు అనేక సందర్భాల్లో అర్జీలు పెట్టిన నేపథ్యంలో గత ప్రభుత్వం రాజధానిలో ఇచ్చిన ఇంటి స్థలాలను రద్దుచేసి గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తామంటున్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఇక్కడ అమలు చేయటం లేదన్నారు. గెలిస్తే నియోజకవర్గం లో ఎక్కడ నివసిస్తున్న వారి కైనా ఇంటి పట్టాలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయలేదని గత ప్రభుత్వం ఇళ్లపట్టాలిస్తే స్థలం ఎక్కడ ఉందో కూడా తెలియటం లేదని వాపోయారు. గతంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిన ప్రభుత్వం కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని ఈనాడు సంక్షేమ బోర్డు పనిచేయని కారణంగా మాకు ఏదైనా ప్రమాదం జరిగిన సమస్య వస్తే మమ్మల్ని ఆదుకునే ప్రభుత్వాలే లేవని భవన నిర్మాణ కార్మికులు తెలిపారు. గతంలో రెండు మూడు వందలు వచ్చే కరెంటు బిల్లులు ఈరోజు ఏడు ఎనిమిది వందల రూపాయలు కట్టాల్సి వస్తుంది అని ఈ విధంగా బిల్లులు వస్తే భవిష్యత్తులో బతకడం చాలా కష్టం అని ఒక నిరుపేద మహిళ బృందం దృష్టికి తీసుకొచ్చింది. దళితవాడలో ట్రాన్స్ఫారము వద్ద మంటలు వస్తున్నాయని దీనిని వేరేచోటకు మార్చాలని కోరారు. ఈ పర్యటనలో సిపిఎం నాయకులు కాండ్రు ఆంజనేయులు, చిట్టేల జనార్ధనరావు, బిట్రా రాంబాబు, గుద్దంటి కష్ణారావు, పులివర్తి వెంకటేశ్వరరావు, చిట్టేల సీతారామాంజనేయులు మునగాల శ్రీనివాసరావు మహిళా సంఘం నాయకురాలు మునగాల సంధ్య గౌరబత్తుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

వాగు కట్టమీదే మూడు దశాబ్ధాలుగా పూరిగుడిసెల్లో జీవనం

ప్రజాశక్తి - పెదనందిపాడు

కాకుమాను మండలంలోని కొమ్మూరు, గార్లపాడు గ్రామాలలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలను ఆదివారం నిర్వహించారు. గార్లపాడు వాగు కట్టమీద సుమారుగా 30 సంవత్సరాల నుంచి 20 ఎస్టీ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని వారు బృందం సభ్యులకు తెలిపారు. గ్రామానికి దూరంగా నివాసం ఉంటున్నామని, వాన పడితే వాగు కట్ట బురద మయం అవుతుందని, వర్షం పడినప్పుడు పూరిల్లు కావడం వల్ల ఇంటి లోపల వర్షం కురిసి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన తమ సమస్యలు ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కొమ్మూరు గ్రామంలో కొత్త ఎస్సీ కాలనీలో రోడ్ల వసతి, డ్రైనేజ్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు చెప్పారు. ఉపాది పనులు సక్రమంగా ఇవ్వడం లేదని బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ ఈ సమస్యలపై తాము మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద వినతి పత్రాలు అందజేసి, ఆందోళనలు నిర్వహిస్తామని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొత్త వెంకట శివరావు, జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఇంకొకరికి తీవ్ర గాయాలు



వెంకట సత్యం (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - మాచర్ల

వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయ పడ్డారు. మండలంలోని గుండ్ల పాడు గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ళ వెంకటసత్యం(25) మరిపూరి మణికంఠలు ద్విచక్ర వాహనంపై మాచర్ల నుండి వెల్దుర్తి వైపు వెళుతుండగా ఉప్పలపాడు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బొల్తాపడింది. దాంతో ఉప్పుతోళ్ళ వెంకటసత్యం, మణికంఠలు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా మాచర్ల ప్రబుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమద్యలో వెంకటసత్యం(25) మృతి చెందాడు. మణికంఠ మాచర్ల ప్రబుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెంకట సత్యంకు భార్య రమాదేవి, ఒక కుమారుడు ఉన్నారు.



వస్త్రాలు పంపిణీ చేస్తున్న సుభాని

పారిశుధ్య కార్మికులకు దుస్తులు బహూకరణ

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలోని 22వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ ఫాతిమా వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు షేక్ సుభాని ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య కార్మికులకు వస్త్రాలను బహుకరించారు. వార్డ్ అభివద్ధికి ఫాతిమా చేసిన పలు కార్యక్రమాలను వారు ఈ సందర్భంగా ప్రస్తావిం చారు. తొలుత ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిబాబు, రిహానా, రావి కష్ణమోహన్, చిన్ని, ఈదర వెంకట పూర్ణ చంద్, కె కోటేశ్వరరావు, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోవిడ్ అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలి

'కోవిడ్‌ని ఎదుర్కొని ఐదేళ్లు' అంశంపై సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - గుంటూరు

కొవిడ్ లాంటి ఘోర ఆరోగ్య విపత్తుల నుండి దేశాలు, ప్రభుత్వాలు ఎన్నో గుణపాఠాలు నేర్చుకోవాల్సి ఉందని, కొవిడ్ అన్ని విధాల నష్టపరిచినా చిట్ట చివరకు దాని నుండి బయటపడి ముందుకు సాగటం మానవ సమాజ సమిష్టి విజయమని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న వక్తలు అభిప్రాయపడ్డారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో "కొవిడ్-19ని ఎదుర్కొని ఐదేళ్లు పూర్తయిన" సందర్భంగా ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మేధావుల ఫోరం కన్వీనర్ పిఎస్. మూర్తి మాట్లాడుతూ 2020, మార్చి 11న ప్రపంచ ఆరోగ్య సంస్థ కోవిడ్‌ని పెనువిపత్తుగా ప్రకటించడంతో అన్ని దేశాలు అప్రమత్తమయ్యాయన్నారు. దేశాలు , పట్టణాలు, నగరాల, గ్రామాల మధ్య ఆఖరికి మనిషికీ మనిషికి మధ్య భౌతిక దూరం అనివార్యమై కనీవినీ ఎరుగని పరిస్థితి నెలకొందని, అన్నిచోట్ల భయందోళనలు అలుమకున్నాయని, రోజువారి జీవనం అస్తవ్యస్తమై పోయిందని అన్నారు. కొవిడ్ రెండో దశలో వ్యాధి ప్రభావం ఎక్కువై మరణాలు సంభవిస్తున్నప్పుడు కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ధన దాహం కంపరం పుట్టించిందన్నారు. వ్యాక్సిన్‌ను కనిపెట్టి వైద్య, వైజ్ఞానిక రంగం ఇలాంటి విపత్తులను ఎదుర్కొని పైచేయి సాధిస్తుందని మరోసారి రుజువైందన్నారు. ఇంజనీర్, విశ్లేషకులు ఎన్. సదాశివం మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వైద్యులు, నర్సులు, పారిశుధ్య కార్మికులు తదితరుల నిరంతర కృషి, సేవలతోనూ విజయవంతంగా కోవిడ్ మహమ్మారిని ప్రపంచం తిప్పి కొట్టిందన్నారు. ఇలాంటి విపత్తులు తారసపడ్డప్పుడు హడావుడి పడటం కాకుండా అవి తలెత్తకుండా చూడటం, తారసపడితే తగు రీతిలో ఎదుర్కోవటం మన కర్తవ్యంగా ఉండాలన్నారు. సమావేశంలో అవగాహన సంస్థ సభ్యులు ఎ.అమరాచారి, డి.వి సాయిబాబు, ఎల్. మురళీకష్ణలు ప్రసంగించారు.



మాట్లాడుతున్న కొండా శివరామిరెడ్డి

వినియోగదారులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - గుంటూరు

వినియోగదారుల హక్కులకు భంగమేర్పడుతున్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చట్టాలతో మోసాల నుండి.. అధిక ధరల నుండి.. కల్తీ కారకాల నుండి వారికి రక్షణ కల్పించాలని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంఘాల నేతలు, వినియోగదారుల ఉద్యమ నాయకులు ప్రసంగిస్తూ అన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన 'అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవ' కార్యక్రమానికి వినియోగదారుల సంఘం నాయకులు కె. సాంబయ్య అధ్యక్షత వహించారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు మెరుగు పడాలన్నా వాణిజ్య వ్యవస్థలు నిలదొక్కుకోవాలన్నా వినియోగదారుడే కీలకమన్నారు. అధిక సుంకాల విధింపు వలన వినియోగదారుల్లో కొనుగోలు శక్తి తగ్గుతుందని, దాని ఫలితంగా ఆర్థికాభివృద్ధి చిన్నాభిన్నమవుతుందన్నారు. వినియోగదారుడు తన ఆదాయానికి మించి ఖర్చు చేసి ఆర్థికంగా పతనమయ్యే చర్యలను ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలన్నారు.కార్యక్రమంలో న్యాయ వాది, అవగాహన వినియోగదారుల ఫోరం కన్వీనర్ ముప్పాళ్ళ ప్రసాదరావు తదితరులు ప్రసంగించారు.

చిరస్మరణీయులు పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెదనందిపాడు

తెలుగు మాట్లాడే ప్రజలందరికీ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి, మహాపురుషుడు పొట్టి శ్రీరాములు జీవితం తెలుగు ప్రజలందరికీ ఆదర్శనీయమనీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు గేరా మోహనరావు పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125 వ జయంతి సందర్భంగా ఈరోజు పెదనందిపాడు, ఆర్యవైశ్య కళ్యాణమండపం వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరుడైన పొట్టి శ్రీరాములు జీవితం చిరస్మరణీయమని, త్యాగధనుల జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పారిశ్రామిక వేత్త వంకాయల విద్యాసాగర్ గుప్తా, ప్రసాద్, దాసరి రాధాకృష్ణమూర్తి, దాసరి సత్యనారాయణ, కొత్త శ్రీనివాస్ గుప్తా పలువురు గ్రామ పెద్దలు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా ఈ రోజు అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పెదనందిపాడు, శాఖా గ్రంధాలయంలో పొట్టి శ్రీరాములు 125 వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వహకురాలు పి సుభాషిని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె శివయ్య, వార్డు సభ్యులు వెలినేని శివయ్య, వంశీ, మల్లిక, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - తెనాలి

పొట్టి శ్రీరాములు జయంతి ని పట్టణంలోని ఆర్యవైశ్య సంఘాలు ఆదివారం ఘనంగా నిర్వహించాయి. స్థానిక బోస్ రోడ్డు లోని అమరజీవి విగ్రహానికి తొలుత వారు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం గొప్పది అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్య వైశ్య యువజన సంఘం నాయకులు కె హరి కిశోర్ , డి రవి కుమార్, ఎన్ రజనీ కుమార్, పట్టణ నాయకులు అనిల్ కుమార్, వాసవి యూత్ బదరి, సతీష్, పి తుక్కయ్య పాల్గొన్నారు.



పదో తరగతి పరీక్షలకు అంతా సిద్ధం

ప్రజాశక్తి - కారంపూడి

మండలంలో సోమవారం నుండి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల నిర్వహణకు బ్రహ్మ నాయుడు హైస్కూల్, సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, మోడల్ స్కూల్ మూడు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లూ చేశామని మండల విద్యాశాఖాధికారి ఎన్.రవికుమార్ తెలిపారు. ఇతర ప్రాంతాల నుండి పరీక్ష కేంద్రానికి వచ్చే విద్యార్థులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించే క్రమంలో హాల్ టిక్కెట్లు చూపితే ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఒక ఆశా కార్యకర్త, ఒక ఎఎన్ఎం అందుబాటులో ఉంటారని, వారి వద్ద ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో నూరు శాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో వంద రోజుల ప్రణాళిక అమలు చేశామన్నారు. ఇప్పటికే రెండు విడతలుగా ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను మానసికంగా పరీక్షలకు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎండలు అధికం అవుతున్న నేపథ్యంలో ప్రతి పరీక్ష కేంద్రంలో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. మండల వ్యాప్తంగా 14 పాఠశాలల నుండి 765 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, వీరిలో సప్లిమెంటరీ విద్యార్థులు 24 మంది ఉన్నారని చెప్పారు. పరీక్షల నేపథ్యంలో ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

రెండు కేంద్రాల్లో 477 మంది విద్యార్థులు

ప్రజాశక్తి-ఈపూరు

సోమవారం నుండి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లన్నీ సిద్ధం చేసినట్లు ఎంఈఓ రామతులసి చెప్పారు. మండలంలో ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎ,ముప్పాళ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా కేటాయించినట్లు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 477 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని, ఈపూరు పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా ఆర్.రంగారావు, ఎ.ముప్పాళ్లలో పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా షేక్ మహబూబ్ సుభాని బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కట్ట సాంబయ్య మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వైసిపి నాయకుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కట్ట సాంబయ్య (70) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సాంబయ్య సత్తెనపల్లి మండలం నందిగామలో గుండె నొప్పితో మరణించారు. సమాచార తెలుసుకున్న నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు గ్రామానికి చేరుకుని సాంబయ్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జెల సుధీర్ భార్గవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, టిడిపి నాయకులు లగడపాటి గజానన, వైసిపి నాయకులు తదితరులున్నారు.





నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

కంది రైతుకు కష్టం



ఆత్మకూరు వద్ద పొలంలో కందులను జెల్లెడ పడుతున్న రైతులు

- గతేడాదికంటే భారీగా పడిపోయిన ధరలు
- దిగుబడిని దెబ్బతీసిన వానలు, తెగుళ్లు
- గోడదెబ్బ, చెప్పదెబ్బలా రైతుల దుస్థితి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

గతేడాది మాదిరే ఈ ఏడాది కూడా మంచి గిరాకీ ఉంటుందని భావించిన రైతన్నలు మాచర్ల నియోజకవర్గంలో సాధారణ విస్తీర్ణం కంటే రెట్టింపుగా కంది పంటను సాగు చేశారు. ఎంత కష్టపడినా అనుకున్నంత దిగుబడి సాధించలేకపోవడం ఒకెత్తయితే తీరా కొద్దిపాటి దిగుబడి చేతికొచ్చి అమ్ముకునేలోగా ధరలు సైతం పడిపోవటంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి.

మాచర్ల వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల పరిధిలో 33,267 ఎకరాల్లో కంది సాగైంది. ఇందులో మాచర్ల మండలంలో 3,362 ఎకరాలు, వెల్దుర్తి మండలంలో 12,250, దుర్గి మండలంలో 12,357, రెంటచింతల మండలంలో 2,115, గురజాల మండలం 3,180 ఎకరాలు చొప్పున రైతులు సాగు చేశారు.

ప్రతి ఏడాది సాధారణ కంది పంట సాగు 13,370 ఎకరాలు కాగా ఈ ఏడాది రెట్టింపు కంటే ఎక్కువగా 33,267 ఎకరాల్లో రైతులు కంది పంటను సాగుచేశారు. చాలా మంది రైతులు ముందుగా పత్తి పంట వేసి రెండు, మూడు నెలలకే తెగులు సోకి, వైరస్‌ల భారిన పడటంతో ఆ పైరును తొలిగించి దాని స్థానంలో కందిపంటను వేశారు. ఎన్నో ఆశలతో, అహర్నిశలూ కష్టపడి సాగుచేసిన రైతులకు కంది పంట కలసిరాలేదు. పైరు ఏపుగా పెరిగి, పూత, పిందె దశలో ఉన్న సమయంలో నవంబరు-డిసెంబర్ నెలల్లో తుపానుల ప్రభావంతో కురిసిన వర్షాలు రైతలను నష్టాలు వైపు నెట్టాయి. అధిక వర్షాలకు పూత, పిందె రాలిపోవటంతోపాటు కంది పైర్లకు తెగుళ్ల సోకి వైరస్ బారిన పడ్డాయి. వైరస్ తెగులు నివారణకు రైతులు వేలాది రూపాయతో పలు రసాయనిక మందులను పిచకారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరికి ఎకరాకు మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ధరలు రూ.ఏడు వేలుకు పడిపోయాయి. సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా దక్కక రైతులు నష్టాలు పాలయ్యారు. దుక్కి, విత్తనాలు, ఎరువులు, రసాయనిక మందులు, కోత, కూలీ ఖర్చులతోపాటు ఇతర ఖర్చులు కలిపితే ఎకరానికి రూ.20 వేలకు పైగా పెట్టుబడి అయిందని రైతులు చెబుతున్నారు. తీరా పంట అమ్మబోతే వ్యాపారులు రూ.6 వేలు నుండి రూ.6,500కు మించి కొనడం లేదు.

ఆశించిన దిగుబడి రాలేదు



మూడెకరాలు సొంత పొలంలో కంది పంటను సాగుచేశాను. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఆశించిన మేరకు దిగుబడి రాలేదు. పైరు ఏపుగా పెరిగిన దశలో అధిక వర్షాలు కురవడంతో పూత రాలిపోయింది. దీనికి తోడు పంటకు వైరస్ సోకింది. తెగులు నివారణకు మందులు ఎక్కువసార్లు పిచికారి చేయాల్సి వచ్చి ఖర్చులు ఎక్కువయ్యాయి. ప్రభుత్వం పంట నష్టపరిహారం ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి.

జెల్లె బ్రహ్మం, రైతు, మాచర్ల .

దిగుబడి తగ్గి నష్టం..



సొంతంగా రెండున్నర ఎకరాల్లో కంది పంటను సాగు చేశాను. పంటకు వైరస్ సోకిన కారణంగా ఏడు క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. పెట్టుబడి ఎకరాకు రూ.20 వేలు వరకు అయ్యింది. చేసిన కష్టానికి ప్రతిఫలం దక్కలేదు. క్వింటాళ్ కంది రేటు కనీసం రూ.8వేలు వుంటే నష్టాలు లేకుండా పెట్టుబడి అన్నా దక్కేది.

జూలకంటి వీరారెడ్డి, రైతు, వెల్దుర్తి

6,700 క్వింటాళ్లు కొన్నాం



ఇప్పటి వరకు రైతుల నుండి 6700 క్వింటాళ్ల కందిని రూ.7,550 ధరకు కొనుగోలు చేశాం. రైతుకు గన్ని బ్యాగులు, కూలి అంతా ప్రభుత్వమే భరిస్తుంది. గ్రామంలో ఉన్న రైతుసేవా కేంద్రం ద్వారా కంది కొనుగోలు చేస్తున్నాం. బహిరంగ మార్కెట్లో ఉన్న ధర కంటే ప్రభుత్వం చెల్లిస్తున్న ధర అధికంగా ఉంది. రైతులు తమ పంటను రైతుసేవా కేంద్రాల్లో అమ్ముకోవాలి.

లక్ష్మారెడ్డి, మాచర్ల మండల వ్యవసాయాధికారి

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి



ప్రభుత్వాలు మారినా రైతుల పరిస్థితులు మారటం లేదు. రైతులు దయనీయ పరిస్థితుల్లో ఉంటున్నారు. పంటలకు మద్దతు ధరల్లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ ఏడాది మిర్చి ధర క్వింటాళ్ రూ.20 వేల నుండి రూ.10 వేలకు పడిపోయింది. కంది ధరలు కూడా రూ.10వేలు నుండి రూ.6వేలుకు పడిపోయాయి. పంటలకు మద్దతు ధర కల్పించేలా ఏడాదికి రూ.5వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

బి.మహేష్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి.



ఖైదీల నుండి వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తులు

సబ్ జైలును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లిలోని సబ్ జైలును గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ పార్థసారథి, జిల్లా న్యాయ సేవాధికార కమిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జియావుద్దిన్ సందర్శించారు. సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను, ఆహారం, సరుకుల నాణ్యతను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతనూ గమనించారు. ఖైదీలతో మాట్లాడి వారి వివరాలు తెలుసుకున్నారు. సత్‌ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఆర్థిక స్తోమత లేని వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, కావాల్సిన వారు తెలపాలన్నారు. పరిశీనలో సత్తెనపల్లి సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్ కుమార్ రెడ్డి, సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, ప్యానల్ న్యాయవాది బి.ఎల్.కోటేశ్వరరావు, సూపర్నెంట్ వెంకటరత్నం పాల్గొన్నారు.

చెస్‌తో మానసిక చురుకుదనం


ప్రజాశక్తి - మాచర్ల రూరల్

చెస్ ఆడటం వలన జ్ఞాపక శక్తి పెరుగుతుందని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాంగంటి మల్లికార్జునరావులు అన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కోదండ రామాలయంలో పల్నాడు చెస్ అకాడమీ సహకారంతో మూడు జిల్లాల స్థాయి చదరంగం పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీలను మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు ప్రారంభించారు. అతిథులు మాట్లాడుతూ చిన్ననాటి నుండే చెస్ ఆడటం వల్ల చురుకుదనం పెరుగుతుందని, చెస్ ఆడేవారు ఇతరులతో పోలిస్తే మానసికంగా ఎక్కువ చురుగ్గా ఉంటారని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, చెస్ కోచ్ కిరణ్, వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శిలు భవనాశి రవితేజ, బచ్చు రాజ్‌కుమార్, పందిరి నరసింహారావు, తిరువీధి వెంకట నాగేశ్వరరావు, ఫాస్ట్ రీజయన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, రీజనల్ సెక్రటరీ చుండూరి సత్యనారాయణ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులిస్తున్న అతిథులు

బకాయిలు చెల్లించకుంటే భూమివ్వండి



100 రోజులపైగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

సమస్యను పరిష్కరించాలని ఎసిసి కార్మికుల డిమాండ్

కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతు


2024 అక్టోబర్ 27 భూముల్లో జెండాలు పాతిన కార్మికులు

ప్రజాశక్తి- తాడేపల్లి

కోర్టుల తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిలు యాజమాన్యం వెంటనే చెల్లించాలని, లేదా సిమెంట్ ఫ్యాక్టరీ భూములు తమకు అప్పగించాలని కోరుతూ గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఎసిసి కృష్ణా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 103 రోజులకు చేరుకున్నాయి. సమస్య పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఉలుకు పలుకు లేకుండా తమకు పట్టనట్లు వ్యవహరించడం పట్ల కార్మిక వర్గం ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తుంది. వందలాదిమంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పిల్లాపాపలతో సహా వంద రోజుల నుండి వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు. అధికారంలో ఉన్న తెలుగుదేశం మినహా అన్ని రాజకీయ పార్టీలు కార్మికుల పోరాటానికి మద్దతిస్తున్నాయి. సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు, ఐఎన్‌టియుసి తదితర ట్రేడ్ యూనియన్ సంఘాలు కార్మికుల కండగా నిలబడ్డాయి. ఎన్నికలకు ముందు ప్రస్తుత మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యేనారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సిమెంట్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారం చేస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు. నిజమేనని నమ్మిన ఈ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున లోకేష్ ఓ ట్లువేసి భారీ మెజార్టీ కట్టబెట్టారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల సమస్య పరిష్కరించక పోగా, సమస్య వివరించడానికి వెళ్లిన కార్మికుల పట్ల మంత్రి లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారని కార్మికులు చెబుతున్నారు. తమ కష్టంతో వేలకోట్ల రూపా యలు విలువచేసే భూములను తాము ఇప్పటివరకు కాపాడేమని, భూముల్లోకి చేరుకొని, ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమ కుటుంబాలతో కలిసి జెండాలు పాతి తమ వెంట తెచ్చుకున్న బొంగులతో గుడిసెలు వేసుకున్నారు. కోర్టు తీర్పుల ప్రకారం యాజమాన్యం తమకు నష్టపరిహారం ఇవ్వాలని, లేదా తమకు రావలసిన డబ్బులకు తగిన భూమైనా ఇవ్వాలని వంద రోజుల నుండి ఉద్యమిస్తున్నారు. ఎన్ఆర్ఐ యాజమాన్యం పోలీసులు రంగంలోకి దింపి కార్మికులను బెదిరింపులకు గురిచేసింది. కేసులు పెడతామని హెచ్చరించింది. పోలీస్ రెవెన్యూ అధికారులుఅండతో కార్మికులు వేసుకున్న తాత్కాలిక గుడిసెలను కూల్చివేసింది. పోలీస్ అధికారులతో ఆ ప్రాంతంలో కవాతు నిర్వహించి కార్మికులను భయభ్రాంతులను చేయాలని చూశారు. వీటిని కార్మికులు లెక్కచేయలేదు. తాడేపల్లి పోలీస్ స్టేషన్ లో అక్రమ కేసులు బనాయించారు. అయినా కార్మికులు బెదరలేదు.మొక్కవోని ధైర్యంతో మరల కార్మికులు తాత్కాలిక గుడారాల ఏర్పాటు చేసుకొని అక్కడే ఉంటున్నారు. నిరాహార దీక్ష శిబిరం ఏర్పాటు చేసి అంబేద్కర్ సాక్షిగా రిలే దీక్షలు నిర్వహిస్తున్నారు.

1993 మే 29న ఈ సిమెంట్ లాకౌట్ అయ్యింది. కార్మికులకు ఎటువంటి నష్టపరిహారము చెల్లించ లేదు. దీంతో, కార్మికులు కోర్టులను ఆశ్రయించారు. కార్మికులకు వడ్డీతో సహా నష్టపరిహారం చెల్లించాలంటూ 2015లో సెంట్రల్ లేబర్ కోర్టు, హైకోర్టు ఆదేశాలు ఇచ్చాయి. కార్మికులకు రూ.43 కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని కోర్టులు తీర్పు ఇచ్చినా యాజమాన్యం అమలు జరపడం లేదు. దశాబ్దాలు గడిచినా కార్మికులకు ప్రభుత్వాలు న్యాయం చేయలేదు. ఫ్యాక్టరీ ఈ భూములను అప్పట్లో రూ. 10 కోట్లకు కొనుగోలు చేసింది.నేడు వాటి ధర రూ.2 వేల కోట్లకుపైగా ఉంది. కోల్‌కత్తా కోర్టు ద్వారా 2003లో బాలభాను ఎంటర్ప్రైజెస్, ఎస్ఐఆర్ నామినల్ ధరకు వేలంలో ఈ భూములను దక్కించుకున్నారు. కార్మికులకు నష్టపరిహారం ఇవ్వలేదు. నిబంధనలు అమలు చేయలేదు. న్యాయంగా కార్మికులకు రావాల్సిన వాటా ఇప్పటివరకు అందలేదు. ఈ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. ఫ్యాక్టరీ లాకౌట్ అయిన నాటికి 333 మంది పని చేసే వారు. అప్పటి నుండి యాజమాన్యం న్యాయం చేయకపోవడంతో వారిలో 160 మంది అర్థాకలితో చనిపోయారు. దీనికి ప్రభుత్వాలు, యాజమాన్యాల బాధ్యత వహించాలి. యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే కార్మికులు, అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ తో కలిపి, టిడిపి మినహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రత్యక్ష కార్యాచరణకు దిగారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు భూముల్లోనే ఉంటామని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చెబుతున్నారు. సెంట్రల్ ట్రిబ్యునల్ కోర్ట్, హైకోర్టు కార్మికులకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రభుత్వం వారికి న్యాయం చేసి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కార్మికుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు.


2024 అక్టోబర్ 27న భూముల్లో ఆందోళనలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు

పాలకులు మారినా కార్మికులు కష్టాలు తీరడం లేదు

వై.నేతాజీ , సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి



అనేక ప్రభుత్వాలు వస్తు న్నాయి, పోతు న్నాయి. పాల కులు మారుతున్నారు తప్ప కార్మికుల సమస్యలు పరిష్కా రం కావడం లేదు. సిమెంట్ ఫ్యాక్టరీ సమస్య గొప్ప ఉదాహరణ. ఇప్పటికైనా సిమెంట్ ఫ్యాక్టరీ భూమి 134 ఎకరాలను ప్రభుత్వం స్వాధీ నం చేసుకునే కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలి.

న్యాయ స్థానాల తీర్పు మీద గౌరవం ఉంచాలి

కూరపాటి స్టీవెన్ , ఫ్యాక్టరీ యూనియన్ కార్యదర్శి



హైదరాబాదులోని సెంట్రల్ లేబర్ ట్రిబ్యునల్ కోర్ట్, మరియు హైకోర్టు ఇచ్చిన తీర్పులను రాష్ట్ర ప్రభుత్వం గౌరవం ఉంచి అమలు చేయాల్సిన అవసరం ఉంది. రూ 42 కోట్ల 93 లక్షల ఎనిమిది వేల 700 రూపాయలు కార్మికులకు నష్టపరిహారం ఇమ్మని కోర్టులు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అటు స్థల యజమాని, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కార్మికులు పోరు మార్గం ఎంచుకున్నారు. మేం ప్రభుత్వాన్ని బిక్ష అడగటం లేదు. మా కష్టార్జితం ఇమ్మని అడుగుతున్నాం.

వివాహం చేసుకోలేదు

బి సూర్యప్రకాశ్రావు, సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుడు



1985 సంవత్సరం నుండి సిమెంట్ ఫ్యాక్టరీ లో ఉద్యోగం చేశాను. 89 లో ఫ్యాక్టరీ అక్రమ లాకౌంట్‌కు గురైంది. అప్పుడు నా వయసు 24 ఏళ్లు. కుటుంబ భారం మొత్తం నా మీద పడింది. ఏం చేయాలో అర్థం కాలేదు. పెళ్లి కూడా చేసుకోలేదు. కూలి పనులకు వెళ్లాం. అనేక ఇబ్బందులు, ప్రజలు పడ్డాం, పడుతున్నాం.

ఎన్నికలముందు లోకేష్ నా నెత్తిన చేయి పెట్టి హామీ ఇచ్చాడు

నా భర్త కోర్టులోనే చనిపోయారు : షేక్ ఇమాంబి



సిమెంట్ ఫ్యాక్టరీలో మా మామ జైన్ పని చేశారు. తర్వాత నా భర్త జానీ పనిచేశారు. ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ గురైన తర్వాత, కార్మికుల తరపున కోర్టుకెళ్లిన నా భర్త అక్కడే కుప్పకూలి చనిపోయాడు. పస్తులు ఉన్నాం. పిల్లల పెళ్లిళ్ల ఆగిపోయాయి. ప్రస్తుత మంత్రి లోకేష్ ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు నా నెత్తిన చేయి పెట్టి సిమెంట్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చాడు. అధికారంలోకి వచ్చాక సమస్య పరిష్కరించాలని అడుగుతుంటే ఇప్పుడేమో కార్మికులను బయటకు గెంటిస్తానంటున్నారు.

తాత ముత్తాతల నుండి పనిచేశారు

వై.రమాదేవి, కార్మికుల కుటుంబ సభ్యులు



తాత ముత్తాతల నుండి ఐదు తరాలు సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేశాయి. స్థిరాస్తులు ఏమీ లేవు. పిల్లల్ని చదివించుకోలేకపోయాం. నా భర్త నైపుణ్యం లేని పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించారు. ప్రస్తుతం వయస్సు పైబడి పనులు కూడా చేయలేకపోతున్నారు.

నేడు తెనాలికి రానున్న మాజీ సీఎం జగన్

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సోమవారం తెనాలి రానున్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడి వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. సాయంత్రం ఐదున్నర గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి బుర్రిపాలెం రోడ్డులోని ఏ ఎస్ ఎన్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలకు రాత్రి 7 గంటలకు చేరుకొని, 7.15 నిమిషాల వరకు రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొంటారు. తదుపరి బయలుదేరి తాడేపల్లి వెళ్లనున్నారు.

నేడు సిపిఎం ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో సోమవారం సిపిఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమ వారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయ్యే ప్రజా చైతన్య యాత్ర సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పాల్గొంటారని, సిపిఎం తాడేపల్లి మండల కమిటీ సభ్యులు, సిపిఎం సభ్యులు సానుభూతిపరులు ఈ ప్రజా చైతన్య యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.


పెన్షన్లు అందచేస్తున్న అవోపా ప్రతినిధులు

అవోప ఆధ్వర్యంలో పేదలకు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు స్థానిక అరండల్‌పేటలోని అవోప కార్యాలయంలో ఆదివారం అపోప అధ్యక్షులు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్లు పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా సాయిప్రగతి ఇన్‌ఫ్రా డైరెక్టర్ తెడ్ల గురుప్రసాదరావు మాట్లాడుతు ప్రతినెల రూ.500ల చొప్పున 108 మందికి పెన్షన్ ఇవ్వడం, వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీ యమని అన్నారు. అవోప కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కరూర్ వైశ్య బ్యాంకు మేనేజర్ సి.హెచ్ అరవింద్ గణేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దానగుణానికి మారుపేరు అని అన్నారు. అవోప రాష్ట్ర కార్యదర్శి రాచపుడి సుబ్బారావు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితంగా భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని, ఆయన త్యాగం మరువకూడదని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఊటుకూరి నాగేశ్వరరావు, కార్యదర్శి రాధాకష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయిరమేష్, అమరా రమేష్, మిరియాల మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు

29 నుంచి ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ఎడ్ల బల ప్రదర్శన

ప్రజాశక్తి - తెనాలి

ఈనెల 29 నుంచి మార్చి 4వ తేదీ వరకు ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన, బండలాగుడు పోటీలు, పశు ప్రదర్శన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించనున్నారు. తన తండ్రి జ్ఞాపకార్థం నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలను కృష్ణ గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. చురుగ్గా సాగుతున్న పోటీల ఏర్పాట్ల వివరాలను ఆయన వివరించారు. జాతీయస్థాయిలో నిర్వహించే ఎడ్ల బల ప్రదర్శన, బండలాగుడు పోటీలు, పశుపాల ప్రదర్శన, వ్యవసాయంలో ఆధునిక పరికరాల ప్రదర్శన, ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల స్టాల్స్ నిర్వహణ, మెడిసినల్ ప్లాంట్స్ ప్రదర్శన తదితరాలు ప్రదర్శనలో ఉంటాయని తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్ర రైతులు ఈ ప్రదర్శనను తిలకించనున్నారని, గత ఏడు సంవత్సరాలుగా పోటీలను నిర్వహిస్తున్నామని ఆలపాటి తెలిపారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో విరామం పలికినా, తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. వీక్షకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బరి ఏర్పాటు, అతిథులను ఆహ్వానించటం, సభా కార్యక్రమ నిర్వహణ, ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాలను పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రతిరోజు ఈ కార్యక్రమాలలో అతిథులుగా పాల్గొంటారని, ఈ నేపథ్యంలో ఏర్పాట్లు, బందోబస్తు తదితరాలపై అధికారులు తెలియజేశామన్నారు. ఏర్పాట్ల పరిశీలనకు ఇప్పటికే 18 కమిటీలు పనిచేస్తున్నాయని ఆలపాటి చెప్పారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా, వీక్షకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కోఆర్డినేషన్ కమిటీలు జాగ్రత్త వహిస్తున్నాయి.


బండలాగుడు పోటీలకు సిద్ధం చేసిన బండలు, ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆలపాటి


వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఇక పోటీల విషయానికి వస్తే ఏడు రోజులపాటు ఏడు బండలు, ఏడు సైజుల్లో ఉన్న వాటిని ఎడ్ల జతలు లాగనున్నాయి. రెండు పళ్ళు, నాలుగు పళ్ళు, ఆరు పళ్ళు, సేద్యం సైజు, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు జరుగనున్నాయి. 2018లో నిర్వహించిన ఏడవ రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలో కృష్ణాజిల్లా కానూరుకు చెందిన డి.వి.ఆర్ ఎడ్ల జత విజేతలుగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. తిరిగి 2025లో నిర్వహించే ఎడ్ల బల ప్రదర్శన పోటీలలో ఏ జత విజేత కానుందో వేచి చూడాల్సిందే. మొత్తం మీద ఏడు రోజులపాటు రైతులకు పశు ప్రదర్శన, వివిధ రకాల పోటీలు కనువిందు చేయనున్నాయి.



నూతన హాస్పిటల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా

నూతన హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణం నరసరావుపేట రోడ్డు నందు ప్రముఖ వైద్యులు డాక్టర్ సింగరాజు సాయికష్ణ నిర్మించిన.సాయి కష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నూతన భవనాన్ని సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకష్ణదేవరాయలు, సినిమా దర్శకుడు బాబి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యెల్లేడి రామ స్వామి, జనసేన నాయకులు సుమన్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేశన శంకరరావు

నామినేటెడ్ పదవులలో బిసిలకు 50 శాతం హామీ అమలేది?

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా నామినేటెడ్ పదవులలో బిసిలకు 50శాతం కేటాయిస్తా మని చెప్పి అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చేస్తోందని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు ఆరోపించారు. ఆదివారం ఆయన నరసరావుపేటలో పర్యటించారు. పల్నాడు రోడ్డులోని మహాత్మ జ్యోతిరావు పూలే, విశ్వకర్మ, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్ర హాలకు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనం తరం పల్నాడు రోడ్డులో హోటల్‌లో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో కేశన మాట్లాడుతూ బిసి కులాల జనగణన చేపడతామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం చేస్తున్నా యన్నా రు. అధికారకంలోకి రాగానే బిసి రక్షణ చట్టం తెస్తామని నామి నేటెడ్ పదవులలో బిసిలకు 50 శాతం ఇస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీను మాట్లాడుతూ లాసెట్, ఎంసెట్ పాలీసెట్, ఇతర అన్ని రకాల సెట్లకు బీసీ విద్యార్థులకు ఎంట్రన్స్ ఫీజులో రాయితీ ఇవ్వాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవని దీనిపై మంత్రి లోకేష్ స్పందించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు మురళి మాట్లాడుతూ రేపల్లెలో జరిగిన అమర్నాథ్ గౌడ్ హత్య కేసు సిబిఐకి బదిలీ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా బాధితులకు న్యాయం చేసామని ఇచ్చిన హామీని మంత్రి లోకేష్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.మహేష్, కె.రమేష్, గురు ఆంజ నేయులు పాల్గొన్నారు.

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫ్రిడ్జ్ వితరణ

ప్రజాశక్తి - వినుకొండ : ఎస్సీ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కుటుంబ ఆధ్వర్యంలో నడుస్తున్న శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.14,600 విలువగల శాంసంగ్ ఫ్రిడ్జ్‌ను విరాళంగా అందించారు. ఆదివారం ఈ మేరకు ఫౌండేషన్ ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ ఫ్రిడ్జ్ ను ఆస్పత్రి వైద్యురాలు పర్వీన్ బేగం, ఆరోగ్య సిబ్బందికి ఫౌండేషన్ అందజేశారు.కార్యక్రమంలో పివి సురేష్ బాబు, గట్టుపల్లి శ్రీను, మోటుపల్లి నరసింహారావు, వెంకట్రావు, పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంతో తెలుగువారికి గుర్తింపునిచ్చిన అమరజీవి

- పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు నివాళి

ప్రజాశక్తి - వినుకొండ

మనకంటూ ఒక రాష్ట్రం లేకుండా మద్రాసీలుగా పిలుస్తున్న రోజుల్లో ప్రత్యేకరాష్ట్రాన్ని సాధించి తెలుగువారికి గుర్తింపునిచ్చిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం వినుకొండ పాత మార్కెట్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగువారి కోసం రాష్ట్రం కావాలని 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి లక్ష్యం సాధించారని, భాషాప్రయుక్త రాష్ట్రాలకూ ఆద్యుడిగా నిలిచారన్నారు. అలాంటి వ్యక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం కోసం, కుల వివక్ష అధికంగా ఉన్న ఆ రోజుల్లో సామాజిక రుగ్మతలపై పోరాటం



పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న జీవీ, పలువురు

చేసిన గొప్ప స్వాతంత్ర్యా సమరయోధుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆశయం కోసం ప్రాణాలు త్యాగం చేసిన భారతదేశ అతి ముఖ్యుల్లో ఒకరుగా నిలిచారంటూ నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు లాంటి అయిదుగురు ఉంటే దేశాన్ని స్వాతంత్ర్యం ఎప్పుడో సాధించేవాడిని అన్న మహాత్మాగాంధీ మాటలే అమరజీవి గొప్పతనానికి నిదర్శన మన్నారు. గాంధీ సూచించిన అహింస, ధర్మం. హరిజనోద్ధరణ, సత్యం కోసం పోరాడిన పొట్టి శ్రీరాములు నేటి యువతకు ఆదర్శమన్నారు. దేశం, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలనుకునే ప్రతిఒక్కరికీ ఆయనో స్ఫూర్తి దీపమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అదే అహింసా రాష్ట్రంలో ముందుకు వెళ్తున్నారని అన్నారు. హింసకు తావు లేకుండా ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు కాపాడుతూ రాష్ట్రాభివృద్ధి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అందుకే ప్రజలు చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వినుకొండ మున్సిపల్ ఛైర్మన్ డా. దస్తగిరి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్ సహా పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు

తెలుగువారి ఆత్మగౌరవం వడ్డె ఓబన్న

విగ్రహావిష్కరణలో ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు



వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మాచర్ల :

బ్రిటీష్ వారిని గడగడ లాడించిన తొలి స్వాతంత్ర్య సమరయోధుల్లో వడ్డె ఓబన్న ఒకరని, తెల్లదొరల తుపాకీ గుండ్లకు అశువులు బాసిన ఓబన్న తెలుగువారి ఆత్మ గౌరవానికి చిహ్నమని నర్సరావుపేట పార్లమెంట్ సభ్యు లు లావు శ్రీకృష్ణదేవ రాయలు అన్నారు. వడ్డెర సాధికార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మాచర్ల పట్టణంలోని కొత్తహాల్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఎంపి లావు శ్రీకృష్ణదేవ రాయలు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంతో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ శరీరాన్నే ఆయుధంగా మల్చు కుని ఓబన్న చేసిన స్వాతంత్ర్య పోరాటం అందరికీ ఆదర్శ మన్నారు. మాచర్ల నడిబొడ్డున వడ్డెర్ల ఆత్మగౌరవాన్ని సగర్వంగా నిలబెట్టేందుకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ అభినం దనలు తెలిపారు. ముందుగా ముఖ్య అతిథులకు వడ్డెర సాధికార సంఘం ఆధ్వర్యంలో స్థానిక పార్కు సెంటర్ నుంచి భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఓబన్న విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నర్సింహారావు, తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్రాధ్యక్షుడు ఎం.ధారు నాయక్, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, వడ్డెర సాధి కార సంఘం పెద్దలు, నియోజక వర్గ స్థాయి తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీకి అండదండగా వడ్డెర్లు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి పార్టీకి వెన్నుదండుగా నిలవడమేకాకుండా నిబద్దతో పని చేసింది వడ్డెర సామాజీకవర్గీయులేనని, ఎంపీ, ఎమ్మెల్యేల గెలుపులో వడ్డెర్లు కీలకంగా వ్యవహరించాలని నర్సరావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. వడ్డెర సాధికార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్వాతంత్ర్య సమర యోధుడు, వడ్డెర్ల ఆత్మగౌరవం స్వర్గీయ ఓబన్న నూతన విగ్రహావిష్కర ణోత్సవం అనంతరం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వడ్డెర ఆత్మగౌరవ చైతన్య సదస్సులో ముఖ్య



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

అతిథులు పాల్గొని మాట్లాడారు. తమ గెలుపులో ప్రముఖ పాత్ర పోషించిన వడ్డెర సామాజిక వర్గాన్ని అన్ని విధాలుగా కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ అంటేనే మా పార్టీ.., పార్టీ అంటే మేమే అని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడ్డెర సామాజికవర్గం 2024 సాధరణ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేశారని తెలిపారు. రాజకీయ ప్రాధాన్యతతో పాటు క్వారీల్లోనూ, ఇసుక రవాణలో వడ్డెర సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించడంలో తన వంతు కృషి ఎప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. సత్రశాలలో వడ్డెర సామాజిక వర్గం నూతనంగా నిర్మించిన సత్రానికి నిధులు మంజూరు చేసి, అభివద్ధికి సహకరిస్తానని ఎంపీ లావు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మున్సిపల్ చైర్మన్ పోలూరి నర్సింహారావు, పట్టణ టీడిపి అధ్యక్షులు కొమెర దుర్గారావు, కొమెర అనంతరాములు, వడ్డే వెంకన్న, ఓర్సు క్రాంతి, తన్నీరు శ్రీనివాసరావు, తిరుమల కొండ నరసింహారావు, మంజుల అంజి, మంజుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



నివాళి అర్పిస్తున్న ఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ఉద్యమ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణాలు త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎస్‌పి కె.శ్రీనివాసరావు అన్నారు. నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో అమరజీవి 124 వ జయంతి సందర్భంగా అమరజీవి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవిన్యూ అధికారి ఇ.మురళి కార్యాలయ సిబ్బంది అమరజీవి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నరసరావుపేట పట్టణంలో టిడిపి కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తనయుడు డాక్టర్ ఆదిత్య టిడిపి నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి నివాళులర్పించారు.


పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివుని బొమ్మ సెంటర్ లోని అమరజీవి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు మిస్టర్ గ్రాండ్ అధినేత అత్తులూరి సుబ్బారావు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. 58



ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో

రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు కషి చేశారని కొనియాడారు.ఈ సందర్భంగా అన్నదానం చేపట్టారు.ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు నేటి తరానికి ఆదర్శమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డులోని పొట్టి శ్రీరాము లు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వాసవి క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా చైర్మన్ పోలూరి



పెద్దకూరపాడులో

నరసింహారావు, మాజీ కౌన్సిలర్ మద్దిగపుచిన వెంకట్రామిరెడ్డి విచ్చేశారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ నాయకులు నాగేశ్వర రావు, భవ నాశి రవితేజ, సి.సత్యనారాయణ, పి. పుల్లారావు, టి. వెంకటనాగేశ్వరరావు, నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్ వైసిపి కార్యాలయంలో సత్తెనపల్లి నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ గజ్జలసుధీర్ భార్గవ్ రెడ్డి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. టిడిపి ఆధ్వర్యంలో పొట్టి శ్రిరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రజా వేదిక లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి



సత్తెనపల్లిలో

పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి సత్తెనపల్లి టౌన్ : వైసీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ నియోజక వర్గం వర్గ ఇంచార్జ్ డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పాల్గొని ప్రశంగించారు. అనంతరం పొట్టి శ్రీరాముల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాసల్గొన్నారు.

ప్రజాశక్తి పెదకూరపాడు పొట్టి శ్రీరాములు ఆశయాల కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే పలనాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రమేషు, బెల్లంకొండ రాంగోపాల్రావు బాబురావు, పొట్టి సత్యనారాయణ శ్రీనివాసరావు ఇంకా పలువురు పాల్గొన్నారు.

లాభాల బాటలో వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్



యార్డులో కాటాలు వేస్తున్న హమాలీలు (ఫైల్)

ప్రజాశక్తి దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యాడ్ 20 24- 25 ఆర్థిక సంవత్సరంలో లాభాలు అర్జించడంలో లక్ష్యాన్ని చేరుకుంది. మూడు కోట్ల 27 లక్షలు టార్గెట్ కాగా మూడు కోట్ల 30 లక్షల రూపాయల లాభాన్ని ఆర్థించింది. కోటి 23 లక్షలు పసుపు, కోటి రూపాయలు ధాన్యం, 97 లక్షల రూపాయలు మొక్కజొన్న అపరాల పంటపై యాడ్ ఫీజు యార్డు పరిధిలోని మూడు చెక్ పోస్టుల ద్వారా సెస్ వసూలు చేసి ఈ లక్ష్యాన్ని సాధించినట్లు యాడ్ సెలెక్షన్ గ్రేట్ సెక్రటరీ ఇన్ శ్రీనివాస రావు తెలిపారు. గత రెండు సంవత్సరాల నుంచి యాడ్ వరుసగా లాభాలు ఆర్జిస్తున్న ట్లు తెలిపారు ఈ సంవత్సరం యార్డుకు 75 వేల క్వింటాళ్ల పసుపు అమ్మకానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. యార్డులో రూ.11 లక్షలతో మరుగుదొడ్ల రెస్ట్ హౌస్ మరుమ్మతులు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.



శ్రీనివాసరావు, యార్డ్ సెక్రటరీ

పసుపు సాగు క్రమంగా తగ్గుతూ నిరాశగా మారింది ప్రస్తుత సీజన్లో మండల వ్యాప్తంగా కేవలం 80 ఎకరాలు సాగు చేస్తుండగా అక్టోబర్‌లో వచ్చిన వరదలకు లంక ప్రాంతంలో పంట తీవ్రంగా నష్టపోయింది రాష్ట్రవ్యాప్తంగా కేవలం 22వేల ఎకరాలలో మాత్రమే సాగు జరుగుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

పసుపు పంటకు తిరిగి పూర్వ వైభవం రావాలంటే పంట మార్పిడి అవసరమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి, ప్రముఖ పసుపు వ్యాపారి దారు గూడూరు వెంకట రావు తెలిపారు. దుగ్గిరాల, కడప రకాలలో కురుకుమిన్ ఒకటి 1.6శాతం మాత్రమే ఉండగా సేలం నిజామాబాద్ రకాల పంటలో 2.5శాతం వరకు ఉండడంతో అక్కడి నుండి దిగుమతి చేసుకున్నట్లు తెలి పారు. అంతర్జాతీయ పరిస్థితులు సక్రమంగా లేవని బంగ్లాదేశ్ పశ్చిమ ఆసియా దేశాలకు ఎగుమతులు లేవని అందువలన ధరలు క్రమంగా తగ్గుతున్నట్లు తెలిపారు ఎగుమతుల ఆర్డర్లు వస్తే తిరిగి ధరలు పెరుగుతా యన్నారు. ఆరు నెలల కిందట క్వింటా రూ.16 వేలు పలికిన పసుపు ధరలు క్రమంగా తగ్గుతూ శుక్రవారం కనిష్ట ధర 8100 గరిష్ట ధర రూ.9,600లు సగటు ధరలు రూ.9, 100లు పలికాయి.



గూడూరు వెంకటరావు
ప్రముఖ పసుపు వ్యాపారి

కూటమితోనే అభివృద్ధి సాధ్యం : పెమ్మసాని

ప్రజాశక్తి - పెదకాకాని

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కేంద్ర సహాయకమంత్రి గుంటూరు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు ఆదివారం మండల పరిధి లోని పలు గ్రామాలలో పొన్నూరు నియోజకవర్గ శాసన సభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమారు, పొన్నూరు నియోజక వర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వడ్రణం మార్కెండేయ బాబుతో కలసి పెదకాకాని మండలంలోని పెదకాకాని, తక్కెళ్ళపాడు, కొప్పురావూరు గ్రామాలలో పలు రోడ్లు, కల్వర్టు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దాలను ఒక్కోటి నెరవేరుస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాల్లో పించన్ల పెంచడం, ఫ్రీ సిలిండర్లు ఇవ్వటం, మే నెలలో తల్లికి వందనం ఇవ్వటం, మహిళలకు జిల్లాల్లో ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఎన్టీఆర్ రైతు భరోసాకు నిధులు పెంచి అర్హులైన వారికి అందజేస్తారరని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని తెలుగు దేశం- జనసేన-బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండలం, గ్రామం నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు నెంబర్లు, పార్టీల అనుబంధ కమిటీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రముఖులు

'పది' విద్యార్థులకు అధికారుల సూచనలు

ప్రజాశక్తి మంగళగిరి

రాష్ట్రవ్యాప్తంగా 17వ తేదీ సోమవారం నుండి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో మంగళగిరి మండలంలో మొత్తం 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు కే.శ్రీనివాసరావు, ఎన్.బాబు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఇప్పటికే అన్ని పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 2,700 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వారిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 1,194 కాగా ప్రయివేటు పాఠశాల విద్యార్థులు 1,506 మంది ఉన్నట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం గం.9:30 నుండి మద్యాహ్నం గం.12:45 వరకూ జరుగుతాయన్నారు. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలను రాయాలని ఆకాంక్షించారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : విద్యాశాఖ ఆదేశాల తో అన్ని పరీక్ష కేంద్రాలు వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎం.లక్ష్మినారాయణ, వి.జయంతి బాబు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ తెనాలిలో రెగ్యులర్ విద్యార్థులు 3266 మంది, ఓపెన్ స్కూల్ ద్వారా 320 మంది, 99వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులు మొత్తం 3665 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టిసిలో ఉచితంగా ప్రయాణించ వచ్చున్నారు. పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకుని తమ హాల్ టికెట్లను పరిశీలించుకోవాలని సూచించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం లో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం జరిగిన స్వామి వారి శ్రీ పుష్పయాగోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఆలయ ఆస్థానం మండపంలో సకల శాంతి కోసం స్వామి వార్ల శ్రీ పుష్పయాగోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. 12 రకాలైన సుగంధ పరిమళ పుష్పాల రాశితో శ్రీ స్వామి వార్లకు పుష్పయాగోత్సవం నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు మాల్యా వంతం శ్రీనివాస దీక్షితులు, అర్చక బందం పూజలు నిర్వహించారు. ఉత్సవ విశిష్టతను దీక్షితులు వివరిం చారు. ఉత్సవానికి పట్టణానికి చెందిన నందం సాంబశివరావు, శాంతి కుమారి దంపతులు కైంకర్యపరు లుగా వ్యవహరించారు. దేవస్థాన సహాయ కమిషనర్ అండ్ కార్య నిర్వాహణా ధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తహశీల్దార్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నేటినుంచి మొదలయ్యే ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెనాలి తహసిల్దార్ కెవి గోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పరిధిలో మొత్తం 15పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 100మీటర్ల సమీపం వరకూ 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలలో ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ షాపులు పరీక్ష జరిగేవరకు తెరవ కూడదని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవ్వరికి మొబైల్ ఫోన్ అనుమతి లేదని తెలిపారు. సంగంజాగర్లమూడి, కొలకలూరు, పెదరావూరు, అంగలకుదురు గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కొత్తపేటలోని బాలుర మున్సిపల్ ఉన్నత పాఠశాల, బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాల, బోసురోడ్డులో నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, ఐతానగర్ లోని నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాల, గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ ఉన్నత పాఠశాల, బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, ఐతానగర్ లోని ఆక్స్‌ఫర్డ్ హై స్కూల్, దేవి చౌక్ లోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల, మారీస్ పేటలోని నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాల, చెంచుపేటలోని ఆదర్శ ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు.

రైతు కుటుంబానికి డైమండ్ బాబు పరామర్శ

ప్రజాశక్తి - తాడికొండ :

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసు కున్న కౌలు రైతు సంకూరు హృదయ రాజు (60) కుటుంబాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్చార్జ్ వనమా బాలవజ్రబాబు పరామర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి అండగా ఉండి ఆదు కోవాల్సిన ప్రభుత్వం వారిని విస్మరించటంతో ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి రావడం దుర్మార్గం అన్నారు. చనిపోయిన రైతు కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న డైమండ్ బాబు

నేటి నుంచి నరసింహుని ఆస్థాన అలంకారోత్సవాలు

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో ఈనెల 17వ తేదీ నుంచి 29 వరకు శ్రీ స్వామివారి ఆస్థాన అలంకారోత్సవాలు జరుగుతాయని దేవస్థానం సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామ కోటిరెడ్డి ఆదివారం తెలిపారు. అలంకారోత్సవాలకు సంబం ధించిన వివరాలను ఆదివారం ఆయన వివరించారు. దేవ స్థానం ఆస్థాన మండపంపై రోజూ రాత్రి 7 గంటలకు శ్రీవారి ఆస్థాన అలంకారోత్సవములు జరుగుతాయన్నారు. 17వ తేదీన స్వామివారి మత్స్యావతార అలంకారంతో అలంకారోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 18న వటపత్రశాయి అలంకారము, 19న రుక్మిణి హరణము, 20న గోవర్ధనోద్ధ రణ, 21న గజేంద్రమోక్షం, 22న పార్థసారథి, 23న శ్రీ రంగ నాయకులు, 24న రుక్మిణి కళ్యాణము, 25న స్థంబోద్భవం, 26న కాళీయ మర్దనం, 27న పరమపద నాథుడు, 28న శ్రీ రామ పట్టాభిషేకము, 29న కోదండ రాముడు అలంకారోత్సవాలు జరుగుతాయన్నారు. 30న ఉగాది తిరువంజనోత్సవము, పంచాంగశ్రవణం జరుగుతాయని తెలిపారు.



దీక్షల నుద్దేశించి మాట్లాడుతున్న కూరపాటి స్టీవెన్

నూట మూడవ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిలు కోసం చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 103వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. దీక్షలో బి దానయ్య, ఎండి ఇస్మాయిల్, సిహెచ్ పిచ్చయ్య, బి నవనీతం, శివకుమారి కూర్చున్నారు, ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ చట్టప్రకారం తమకు రావాల్సిన బకాయిలు మాత్రమే తమ అడుగుతున్నా మని చెప్పారు. ప్రభుత్వం ఇది గమనించాలని చెప్పారు. యాజమాన్యం, కార్మికుల మధ్య సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, ఎస్ కే భాష, వై సుబ్బారావు, వై యెహొషువ. బి సూర్య ప్రకాష్‌రావు, సాంబయ్య, వై రమాదేవి, ఎం శివకుమారి, ఎం గురువయ్య పాల్గొన్నారు.




కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వేమారెడ్డి

అధికారమే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు కదలాలి

ప్రజాశ క్తి - తాడేపల్లి

రాబోయే ఎన్నికల్లో అధికారమే పరమావధిగా లక్ష్యంగా చేసుకుని వైసీపీ శ్రేణులు కదలాలని ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పెనుమాక గ్రామంలో ఏర్పడిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నియమించనున్న నూతన కమిటీలకు సహకరించాలని కోరారు. ఎవరు అధైర్య పడొద్దనీ, అండగా ఉంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే పార్టీ బలోపేతానికి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పి.కృష్ణమూర్తి, కె.బాజీ, ఎం.దామేశ్వర్ రెడ్డి, పి. విజయ్ కుమార్ పాల్గొన్నారు.



నిరుపేదలకు సరుకులు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి రత్నాల చెరువు అండర్ పాస్ వద్ద ఆదివారం పారేపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు పారేపల్లి రామకృష్ణ, విజయ లక్ష్మి దంపతుల కుమారులు పారేపల్లి మహేష్ అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో 10మంది నిరుపేదలకు కుట్టుమిషన్లు, తోపుడు బండ్లు పంపిణీ చేశారు. సరుకులు అందజేశారు. గతంలో బీసీ సంక్షేమ సంఘం, పారేపల్లి మహేష్ ఫౌండేషన్ తరపున అనేక సేవా కార్యక్రమాలు చేయడం జరిగింది. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీ తిరువీధుల కిరణ్, కోఆర్డినేటర్ ధనుంజయ్, పారేపల్లి దుర్గా ప్రసాద్, జంజనం వరప్రసాద్ పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా లక్ష్మణరావు, లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-గుంటూరు



బి.లక్ష్మణరావు



డి.లక్ష్మీనారాయణ

సిఐటియు జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.లక్ష్మణరావు, డి.లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం పాతగుంటూరులోని సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్ష, కార్యదర్శుల తోపాటు జిల్లా ఉపాధ్యక్షులుగా సిహెచ్. నాగబ్రహ్మాచారి, కె. బాబుప్రసాదు, జిల్లా కార్యదర్శులుగా వై.నేతాజీ, వై.రమణ (శ్రామిక మహిళ)ను, జిల్లా కమిటీ సభ్యులుగా చింతల శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఈ సంద ర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా రానున్న రోజుల్లో జరిగే ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎనిమిది గంటల పనివిధానం, కార్మిక హక్కుల కోసం అనేక త్యాగాలతో సాధించుకున్న హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హరిస్తూ కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. రైతులు, కార్మిక పోరాటాల వల్ల తాత్కాలికంగా ఆగినా ఏప్రిల్ నుండి లేబర్ కోడ్‌లు అమలు చేయాలనికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఈ ప్రయత్నాలను కార్మికులు అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అఖిల భారత కార్మిక సంఘాలు ఏప్రిల్, మే నెలలో లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దశలవారీ పోరాటం, జాతీయ సార్వత్రిక సమ్మెను జరిపేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారని, ఆయా ఆందోళనలను జిల్లాలో విస్తృతంగా కార్మికుల్లోకి తీసుకెళ్లాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పి.ఫోర్ పేరుతో ప్రైవేటీకరణ విధానాలు అనుసరిస్తుందన్నారు. విశాఖ ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని బట్టబయలు చేయాలని కోరారు. ప్రభుత్వరంగ పరిరక్షణ కోసం ఐక్యపోరాటాలు నిర్వహణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

అంబేద్కర్ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ జాతీయ ప్రతిభా పురస్కారాలు అందచేయటానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సదరన్ ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, జాతీయ అధ్యక్షులు డాక్టర్ పయర్థ నాగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు కాలేజిలు, పాఠశాలలు, ఇంజినీరింగ్ కాలేజిలు, యూనివర్సిటీల నుండి ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఏప్రిల్ 5వ తేదీలోగా దరఖాస్తులు పంపించాలన్నారు. ఏప్రిల్ 13న గుంటూరులో పురస్కారాల ప్రదానం జరుగుతుందన్నారు. వివరాల కోసం 9949929674, 7989088274 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మధుమేహం, రక్తపోటే మూత్రపిండాల సమస్యకు మూలం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న డాక్టర్ పెంట్యాల శ్రీకాంత్

మధుమేహం, అధిక రక్తపోటే మూత్రపిండాల సమస్యకు మూలం అనిప్రముఖ యురాలజిస్ట్ డాక్టర్ పెంట్యాల శ్రీకాంత్ అన్నారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో అరండల్‌పేట లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కిడ్నీ సమస్యలపై ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ మన శరీరంలో చిక్కుడు గింజ ఆకారంలో ఉండే కిడ్నీలు చాలా ముఖ్యమైనవి అని, ఇవి రక్తాన్ని శుద్ధిచేసి, అదనపు వ్యర్థాలను బయటకు పంపుతాయని తెలిపారు. అటువంటి మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంచుకోవాలన్నారు. మూత్రపిండాలు దెబ్బతినడానికి కారణం ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు అదుపులో లేకపోవడం అని తెలిపారు. ఎల్లప్పుడూ మధుమేహం, రక్తపోటును అదుపులో ఉంచుకోవాలన్నారు. ఆ రెండింటి విషయంలో అప్రమత్తంగా లేకపోతే మూత్రపిండాలు దెబ్బతిని రక్తంలో క్రియాటిన్ స్థాయి పెరిగి చివరికి డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. క్రియాటిన్ స్థాయి 1.2 నుండి 1.6 మధ్యలో ఉంటే సాధారణ స్థాయి అని అన్నారు. ప్రోస్టేట్ గ్రంధి గురించి వివరిస్తూ ఈ గ్రంధి మగవారిలో ఉంటుందని, సాధారణంగా ఈ గ్రంధి పరిమాణం 30 నుంచి 40 గ్రాములు ఉంటుందని, వయసు పెరిగే కొద్దీ ఈ గ్రంధి పరిమాణం కూడా కొంత మార్పు చెందుతుందని తెలిపారు. ఈ గ్రంధి పరిమాణంలో మార్పు వచ్చినప్పుడు మూత్ర సమస్యలు కనిపిస్తాయని అన్నారు. అలాంటి లక్షణాలు గమనించినప్పుడు వెంటనే యూరాలజిస్ట్‌ను సంప్రదించాలన్నారు. సాధారణంగా యూరిన్ బ్లాడర్‌కి 250 నుండి 300 మిల్లీ లీటర్ల నిల్వ ఉంచగలిగే సామర్థ్యం ఉంటుందని, మనకు మూత్రం వచ్చినట్లు అనిపించినప్పుడు వెంటనే మూత్ర విసర్జనకు వెళ్లకపోతే మూత్రపిండాలకు ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. సాధారణంగా మధుమేహం అదుపులో ఉండే వారిలో ఇన్ఫెక్షన్ ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉన్నదని తెలిపారు. ముఖ్యంగా మహిళల్లో పీరియడ్స్ ఆగిపోయిన వారిలో, మధుమేహం ఉన్నవారికి, మూత్ర విసర్జనకు వెళ్లకుండా ఎక్కువ సేపు ఆగిన వారిలో యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ ఎక్కువగా వస్తాయన్నారు. మూత్రపిండాల సమస్య ఉన్నవారు వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి డాక్టర్లు సూచించిన మోతాదులో నీటిని త్రాగాలని, సాధారణ వ్యక్తులు కూడా నీటిని ఒక్కసారి ఎక్కువ మొత్తంలో కాకుండా తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తాగాలని సూచించారు. ఆహారంలో ఉప్పు తగ్గించాలని, మూత్రంలో ప్రోటీన్ నష్టాన్ని తొలి దశలలో గుర్తించి మందులు వాడుకోవాలని, ధూమపానం, మద్యపానం మానేయాలన్నారు. అనంతరం డాక్టర్ పెంట్యాల శ్రీకాంత్‌ను అవగాహన సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సభకు టీ.వీ.సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అవగాహన సీనియర్ సభ్యులు కె.చంద్రశేఖరరావు, తన జీవిత కాలంలో 100 సార్లు రక్తదానం చేసిన ఉమామహేశ్వరరావు, కిమ్స్ శిఖర హాస్పిటల్ పిఆర్ఒ కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

త్వరలో నూతన మార్కెట్ భవనం నిర్మాణం : పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి పెమ్మసాని ఎమ్మెల్యే మాధవి తదితరులు

గుంటూరులోని పలు ప్రాంతాల్లో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర ఆదివారం పర్యటించారు. పివికే నాయుడు మార్కెట్ సమస్యల గురించి స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి కలిసి పెమ్మసాని తెలుసుకున్నారు. మార్కెట్ సెంటర్ నుంచి పివికే మార్కెట్ కు వెళ్లిన పెమ్మసాని అక్కడి సమస్యలను పరిశీలించారు. మార్కెట్ లోని కూరగాయలు, ఇతర వ్యాపారులతో మాట్లాడి వారికున్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ అభివృద్ధి తదితర అంశాలపై అక్కడున్న వర్తక, వ్యాపార సంఘాల ప్రతినిధులతో చర్చించారు. తరువాత జరిగిన జిఎంసి కౌన్సిల్ హాల్ సమావేశంలో సంబంధిత మార్కెట్ వర్తక, వ్యాపారుల ప్రతినిధులతో పెమ్మసాని ఆయా సమస్యలపై గురించి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ అభివృద్ధి రీత్యా బహుళ అంతస్తుల భవన నిర్మాణం, అందుకు అవసరమయ్యే నిధుల సమీకరణతో పాటు షాపు నిర్వాహకులపై అద్దెల భారం పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఆయా నిర్మాణాలలో ఏఏ పద్ధతులను అవలంబిస్తే ప్రజలకు, షాపుల నిర్వాహకులకు ఉపయోగకరంగా ఉంటుందనే అంశంపై అధికారులు, నాయకులు, షాప్ నిర్వాహకులు, వర్తక సంఘ ప్రతినిధులు తదితరులు నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు. త్వరలో చేపట్టపోవు ఆ నిర్మాణం, నిధుల భారం పడకుండా తీసుకోవాల్సిన నిర్ణయాలపై పూర్తిస్థాయిలో చర్చలు జరిగిన తర్వాత తెలియజేస్తామని చెప్పారు. మార్కెట్ నిర్మాణం అనంతరం ఆయా ఫ్లోర్‌లు అద్దె ప్రాతిపదికన ఇచ్చేలా ముందస్తుగానే ప్రభుత్వ కార్యాల యాలు, బ్యాంక్‌లు, వ్యాపార సంస్థలతో ముందస్తు అగ్రిమెంట్‌ల తీసుకుంటే మంచిదన్నారు. షుమారు 2ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్, పక్కనే ప్రస్తుతం ఉన్న జిఎంసి కార్యాలయం స్థానంలో నూతన భవనం నిర్మాణాలు చేయడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా చర్చించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశానికి తొలుత పివికె నాయుడు మార్కెట్ పరిశీలించి, వ్యాపారులతో మాట్లాడి, వారి అభిప్రాయలు, అనుమానాలు తెలుసు కొన్నారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రస్తుతం మార్కెట్ లో వ్యాపారస్తుల వివరాలు, ఇప్పటి వరకు రూపొందించిన డిజైన్‌ని వివరించారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు కోవెలమూడి రవీంద్ర, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, ఈరంటి హరిబాబు, నూకవరపు బాలాజీ, జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములుకు నివాళి

ప్రజలకోసం ప్రాణత్యాగానికి వెనుకాడని పొట్టి శ్రీరాములు గారి జీవితం నేటి తరానికి ఆదర్శమని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా హిందూ కాలేజీ జంక్షన్ లోని శ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శాసనసభ్యులు గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలన, బెల్ట్ షాపుల కట్టడికి కృషి

అబ్కారీ చట్టానికి లోబడి మద్యం దుకాణాల నిర్వహణ ప్రతిష్టాత్మకంగా నవోదయం-2 : ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ





గత ప్రభుత్వ హయాంలో మద్యం రేట్లను భారీగా పెంచడం నాణ్యత లేని మద్యం విక్రయాలతో జరిపారు. పల్నాడు జిల్లాలో విచ్చలవిడిగా నాటుసారా తయారీ, అమ్మకాలు జోరుగా సాగాయి. 2016లో అధికారంలో ఉన్న టిడిపి నాటుసారా నాటు సారా నిర్మూలనకు నవోదయం కార్యక్రమం ద్వారా చర్యలు చేపట్టింది. అప్పట్లో నవోదయం కార్యక్రమం పేరిట చేపట్టిన చర్యలతో సత్ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం నాటుసారాను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం మళ్లీ నవోదయం - 2 అమలు చేసింది. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆబ్కారీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా పల్నాడు జిల్లాలో మద్యం విధానం అమలు, నాటు సారా నివారణ, ఇతర రాష్ట్రాల మద్యం రాకుండా శాఖాపరంగా చేపడుతున్న అనేక విషయాలు గురించి ఎక్సైజ్ ఇ.ఎస్ కె.మణికంఠ ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

పల్నాడు జిల్లాలో మద్యం విధానం అమలు ఎలా ఉంది ?

పల్నాడు జిల్లాలో ఎక్సైజ్ చట్టాలకు లోబడి మద్యం విధానం సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. శాఖ పోలీసు సిబ్బంది నిత్యం విస్తృతంగా తనిఖీలు చేస్తూ నిబంధనలు అమలు అయ్యేలా చూస్తున్నాం. సమయపాలనకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

జిల్లాలో మద్యం దుకాణాలు ఉన్నాయి?

పల్నాడు జిల్లాలో మొత్తం 142 మద్యం దుకాణాలు, 48 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. వీటిలో 10 శాతం గీత కార్మిక కుటుంబాలకు కేటాయించడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం నడిపిన మద్యం విధానానికి స్వస్తి పలికి టెండర్లు ఆహ్వానించి అత్యంత పారదర్శకంగా జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో దుకాణం కేటాయించడం జరిగింది.

పల్నాడు జిల్లాలో మద్యం అమ్మకాల లక్ష్యం ఎంత ?

మద్యం అమ్మకాలకు సంబంధించి ఎటువంటి లక్ష్యం లేదు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా నెలకు రూ. 78 నుండి రూ. 80 కోట్ల వ్యాపారం జరుగుతుంది.

మద్యం బెల్ట్ షాపులను అరికట్టేందుకు ఎటువంటి చర్యలు చేపట్టారు?

శాఖ సిబ్బంది నిత్యం తనిఖీలు చేస్తున్నారు. గతంలో గొలుసు దుకాణాలు నిర్వహించిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఒక వ్యక్తి దగ్గర 3 మద్యం సీసాలు కంటే ఎక్కువ ఉంటే కేసులు నమోదు చేస్తాం.

అక్రమ మద్యం, గొలుసు దుకాణ దారులపై ఎన్నికేసులు నమోదు చేశారు?

అక్రమ మద్యం రవాణా అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దుల వద్ద పటిష్ట నిఘా విభాగం ఉంది. 408 మద్యం గొలుసు దుకాణాలపై దాడులు 408 మందిపై కేసులు నమోదు చేసి 906 లీటర్ల మద్యం సీజ్ చేశాం. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి 39 కేసులు నమోదు చేశాం. అదే విధంగా ఇతర రాష్ట్రాల నుండి మద్యం అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో 24 కేసులలో 26 మందిపై కేసులు నమోదు చేసి 140 లీటర్ల మద్యం, 48 లీటర్ల బీరు సీజ్ చేశాం. నాటుసారాకు సంబంధించి 124 కేసులలో 26 మందిపై కేసులు నమోదు కాగా 307 లీటర్ల నాటుసారా, 462 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేయడం జరిగింది.

ధరల పట్టిక లేకుండా అధిక ధరలకు అమ్ముతున్నట్టు ఆరోపణలకు మీ సమాధానం?

ప్రతి మద్యం దుకాణంలో ధరల పట్టిక ఉంది. అధిక ధరలకు అమ్ముతున్నట్లు వస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదు.ఇటీవల ధరలు పెరిగిన సమయంలో పెరిగిన ధర స్టిక్కర్ రావడంలో కొంత జాప్యం ఏర్పడింది. అధిక ధరలకు విక్రయిస్తే ఆధారాలతో సహా తమను సంప్రదిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

నవోదయం - 2 లక్ష్యం ఏమిటి ?

నాటు సారా తయారుచేసినా, అమ్మినా కలిగి ఉన్నా ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, రాష్ట్రాన్ని నాటు సారా రహితంగా తయారు చేసేందుకు ప్రారంభించిన నవోదయం -2.0 కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరుతూ అవగాహన కల్పిస్తున్నాం. పల్నాడు జిల్లాలో బొల్లాపల్లి, వెల్దుర్తి, దుర్గి, అచ్చంపేట మండలాలలో కళాజాత ద్వారా నాటుసారాకు వ్యతిరేకంగా అవగాహన కల్పించి డ్రగ్స్ కు, నాటుసారాకు దూరంగా ఉండాలని గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించాం. నాటుసారా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాడానికి సహకారం అందించాలని కోరారు. నాటుసారా వలన భవిష్యత్తు అంధకారం అవుతుందని యువత మద్యం సేవించి వాహనాలు నడపడం వలన మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమానికి, నాటుసారా రహిత పల్నాడు జిల్లా సాధనకు కషి చేయాలని పేర్కొన్నారు.

(ప్రజాశక్తి-పల్నాడు జిల్లా)